
# స్వామి పరమహంస యోగానంద మరణించిన ఇరవయ్యో రోజున అదే తేజస్సులో ఉన్నారు!



మహానుభావులైన మహాయోగులకు జన్మనిచ్చిన మహిమాన్వితదేశం భారతదేశం.

ఎంతగా ధర్మభ్రష్టులు భారతదేశంలో పుడుతున్నప్పటికినీ, బాబా, పరమహంస, యోగానంద్ వంటి మహాయోగుల కారణంగా దేశ సంపద దిగజార లేదు. ఏ రోజుకారోజు అస్తమించిన సూర్యుడు మరునాటి ఉదయిస్తాడన్నట్టుగానే పునరపిజననంలా వర్ధిల్లుతూనే ఉన్నది.

పరమహంస యోగానంద అమెరికన్‌లను శాంతి సత్యధర్మాల పట్ల ప్రభావితం చేయడం కోసం అమెరికా వెళ్ళారు. 1952సం॥ము మార్చి 7వ తేదీన భారత రాయబారి హెచ్.ఇ.వినయ్ ఆర్.సేన్ గౌరవార్థం లాస్ ఏంజల్స్‌లో జరిగిన విందుకు వెళ్ళారు. అప్పటికి ఆయన వయసు 59 ఏండ్లే! ఎప్పుడూ ఆయన మోమున చిరునగవు. సిరిమల్లెలా విరుస్తూనే ఉండడం సహజం. ఆయన ఆ సభలో ప్రసగించిన అనన్తరమ్ ఆ నగుమోముతోనే కూర్చున్న కుర్చీలోనే అలా జొరిగిపోయారు. ఒక్క చిటుక మాత్రం కాలంలో ఏ అనాయాసమూ లేకుండా దేహత్యాగం చేయడం అందర్నీ ఆశ్చర్యచకితుల్ని చేసింది.

మరణించిన వారి దేహాన్ని ఫారెస్ట్‌లాన్ మెమోరియల్ పార్కులో 20 రోజులుంచారు. ఆయన కళ్ళల్లోని తేజస్సుగానీ, మోమున చిరునవ్వుగానీ శరీరం మార్పులుగాని, వాసనగానీ, శరీర కణువులు ఎండిపోవడం గానీ, శరీరం రంగు మారడం గానీ ఏఁవీ జరగలేదు. ఈ సత్యాన్ని లాస్ ఏంజిల్స్ మార్చురీ డైరెక్టర్ హెరీ.టి.రోవె మార్చి 27న భక్తలోకానికి తెలియజేసారు. అయితే ఇప్పటికినీ పరమహంస యోగానంద అక్కడ కొందరికి స్వప్న దర్శనమిస్తూనే ఉన్నారు. యోగానంద సమాధి లాస్ ఏంజెల్స్‌లో ప్రసిద్ధ క్షేత్రంగా ఈనాటికీ అలరారుతూంది. ●



# ఏడు సంఖ్య ఎంతో గొప్పది!

పూర్వం నా చిన్నప్పుడు మా వూరిలోని షావుకార్లు కొలతలు కొలిచేటపుడు తొలిగా ఒకటి అనడానికి బదులు 'లాభం' అంటూ ప్రారంభించి, రెండూ, మూడు, నాలుగు, ఐదు, ఆరులు చదివి, '7'కు వచ్చేసరికి ఆరున్నొక్కటి అనే వారు, 'ఏడు' సంఖ్య ఏఁవి పాపం చేసుకున్నది చెప్పండి!

తిథుల్లో 7వ తిథి సప్తమి కదు గొప్పది. ఆరోగ్య కారకుడూ, వెల్తురుకు కారకుడైన సూర్య భగవానుని 'రథసప్తమి'ని ఎంతో ఘనంగా చేసుకుంటాం.

ఏడేడు జన్మలబంధం, ఏడడుగుల సంబంధం అంటూ నూతన దంపతుల్ని ఏడడుగులు నడిపిస్తాం. అదే సప్తపది.

అలాగే సప్తఋషులు, సప్తసాగరాలు, సప్త పర్వతాలు, ఆఖరికి వారానికి రోజులు కూడా ఏడే!

ఏడు కొండలవాడు. ఏడు కొండలవాని ఏడు (సప్త) ద్వారాలు, ఇలా ఎన్నో!

జపాను దేశంలో మంచి అదృష్టం భాగ్యం కోసం ఏడుగురు దేవతల్ని కొలుస్తారు. తొలి దేవత. ఈమె భుజంపై ఒక సముద్రపు చేప ఉంటుంది.

రెండో దేవత డాయ్‌కోకుటన్, ఈమె సమృద్ధత, వ్యాపార అధిష్టాన దేవత. ఈ రెండు దేవతల్నే కలిపే ఆరాధిస్తారు. రెండు విగ్రహాలనూ కలిపే ఉంచుతారు. మూడో దేవత బెంజాయిటన్ జ్ఞానం, కళలు, సౌందర్యం, సంగీతానికి అధిష్టాన దేవత. వారి చదువుల దేవత బిసామెంటిన్, యోధులు పీరులు కొలుస్తారు. ఐదో దేవత వుకురోకు జూని ఆనందం, దీర్ఘాయువు కోసం కొలుస్తారు.

ఆరవ దేవత హుతెయా, ఆరోగ్యం సమృద్ధి కోసం కొలుస్తారు. ఏడో దేవత జురోజిన్ ఈమెనే గామా అని కూడా అంటారు. ఆధ్యాత్మిక జ్ఞానం దీర్ఘాయువు కోసం కొలుస్తారు. వీరిలో చాలామంది చైనా నుంచీ జపాన్‌కు వచ్చియుండియుంటారు. చైనాకు వీరు భారత దేశము నుంచే వలస వెళ్లారని తెలుస్తూన్నది.

చైనాకు మనకున్నట్టుగానే బోలెడంత మంది దేవతలు. అక్కడ (చైనాలో) కూడా ఏడుగురు ఋషులు ఉన్నారు. సెవన్ సేజెస్ ఆఫ్ బాంబు గ్రూర్' అంటారు. గ్రీసు దేశంలో ఏడుగురు విద్వాంసులన్నారు. పలు దేశాలలో '7' సంఖ్యకు ఎంతో ప్రాధాన్యమున్నదని గ్రహించవలసి ఉన్నది. ●

నా పుట్టిన రోజు కూడా మార్చిలో వచ్చే '7' అనుకోండి! అందుకని గొప్పదనడంలేదు.

# అర్ధ-శౌచం, అక్షత(తా)పం కలవాడు

# ధనికొండ హనుమంతరావు!



**ఆయన 1919 మార్చి 4వ తేదీన తెనాలి దగ్గర ఇంటూరిలో జన్మించారు. చివరి రోజుల్లో ఆరోగ్యం క్షీణించి ఇంట్లోనే ఉండేవారు. 1990 సం॥ము తాను చూడనేమో అనేవారు. అప్పడే తథాస్తు దేవతలున్నారో తెలియదుగాని 1989 డిసెంబరు 21న కన్ను మూసారు.**

తెనాలికి ఆంధ్రాపారీస్ అనే పేరున్నది. ప్రసిద్ధి గొన్న రచయితలూ, సుప్రసిద్ధి గొన్న కళాకారులందరూ 'తెనాలి' పట్టణం నుంచే కళా, సాహితీకారులందరూ చెన్నపట్టణం వచ్చారు. అక్కడి కళల సాహిత్య కాణాచి సుగుంధాలను చెన్న పట్నానికి తరలింపచేసారు. ఇంకా చెప్పాలంటే ఊడ్చిపెట్టి తమ కూడా చెన్నపట్నం పట్టుకొచ్చేసారు.

వీరందరి కృషీవలత్వంతో చెన్న పట్నం భోజరాజనగరంగా, కృష్ణదేవరాయల భువన విజయంగా తయారయింది. ఇప్పటికీ ఏ రాయి రప్పను తట్టినా 'తెలుగు తెలుగు' అంటూ ప్రతిధ్వనిస్తూంటుంది. నాకు సప్తస్వరాలను చేతి చిటుక వేయగానే స్వర ధ్వనుల సుస్వరాలను పలికే హంపీనగర శిధిల సంగీత మండపం గుర్తుకు వచ్చింది.

ముఖ్యంగా నన్ను బాగా స్పందింపచేసిన వ్యక్తి ధనికొండ హనుమంతరావు. ఆయనొక విలక్షణ రచయిత, చలంతో పోల్చతగ రచయితలెలా లేరో, ధనికొండ హనుమంతరావు మనిషితోనూ, మనసుతోనూ, వఛస్సుతోనూ సరితూగగల రచయితలు లేరు; వాత్సల్యధురీణులూ లేరు.

విశిష్టమైన వ్యక్తి, సద్బ్రాహ్మణుడే అయినప్పటికినీ పూజలూ, పునస్కారముల మీద ఆయనకు నమ్మకం లేదు. సత్యం మీ్మద, మానవత్వంమీద ఆయనకు నమ్మకం ఎక్కువ. తెనాలిలో ఉండగానే 'అభిసారిక' పత్రికను నడపడం వలన ఆయన్నందరూ సెక్సురచయిత అనుకునేవారు. కానీ అప్పట్లోనే తెనాలి నుండి వచ్చే 'జ్యోతి' సాహితీ మాస పత్రికకు ఉత్తేజం ఆయనే కలిపించారు. శరత్ సాహిత్యాన్ని తెలుగువారికి రుచి చూపించిన చక్రపాణి (సుబ్బారావు) గారికి ధనికొండ వారు మంచి మిత్రులు. ఆ చక్రపాణిగారు మద్రాసు వచ్చి నాగిరెడ్డిగారితో చేతులు కలిపి 'చందమామ' ను స్థాపింపచేసి, బహు భాషల పత్రికగా రూపొందడంతో ధనికొండవారిని మద్రాసు పిలిపించారు. ముందుగా ధనికొండ హనుమంతరావుగారిని 'చందమామ' సర్క్యులేషన్ మేనేజర్‌గా నియమింపచేసారు. సాహిత్యమీ్మద మక్కువ గల వారికి ఉద్యోగమేమి తృప్తినిస్తుంది. బయటకు వచ్చి అభిసారిక జ్యోతి కథల మాసపత్రికను ప్రారంభించారు. కొలను బ్రహ్మానందరావు, రావూరి భరద్వాజల నెంతగానో ప్రోత్సహించారు. ఆయన ఇల్లు కథకుల నిలయంగా ఉండేది. కొలను బ్రహ్మానందరావు గారికి చిత్రరంగంపై మక్కువగా ఉండడాన్ని ధనికొండగారు గ్రహించి, ఆయన కోసం 'చిత్రసీమ' మాసపత్రికను ప్రారంభించారు. ఈ 3 పత్రికలు భారత మాతాప్రెస్‌లో అచ్చవుతుండేవి. సమయానికి పత్రికలను వెలువరించడంలో ధనికొండకు మించిన వారు లేరు. ఒక్కసారి ఆ 3 పత్రికల బిల్లును చూచి శ్రమను గమనించి- తానే ఒక ప్రెస్‌ను ప్రారంభిస్తే ఎలా ఉంటుందని క్రాంతిప్రెస్‌ను ఫ్రాన్సిస్ జోసఫ్ స్ట్రీటులో ప్రారంభించారు. మద్రాసులో కల యితర పత్రికలూ, ఆంధ్రప్రదేశ్‌లో ఈ మూల నుంచీ, ఆ మూల వరకూ గల గ్రంథ ప్రచురణ కర్తల పుస్తకాల ముద్రణా ఇక్కడికే రావడంతో ఆయన తన పత్రికలు అభిసారిక,జ్యోతి చిత్రసీమ పత్రికలను ముద్రించుకోవడానికి సమయం లభించలేదు. తన్ను నమ్ముకున్న ప్రచురణ కర్తలకు న్యాయం చేకూర్చడం కోసం, ఆయన తన 3 పత్రికలనూ నిలిపివేసారు. తన మిత్రులైన రాంషాకు అభిసారికనూ, రాఘవయ్యకు జ్యోతి పత్రికనూ, కొలను బ్రహ్మానందరావుకు చిత్రసీమ పత్రికనిచ్చివేసారు. ఆయన హస్తవాసియేమోగాని 'జ్యోతి' ఎన్ని చేతులు మారిననూ బ్రహ్మాండమైన సర్క్యులేషన్ గల పత్రికగా పేరు తెచ్చుకున్నది. కొన్నాళ్ళు బాపు-రమణలు కూడా సంపాదకర్తృత్వం వహించారు. 'జ్యోతి' మహోజ్వల జ్యోతిగా వెలుగొందడానికి, చదువరులు పెరగడానికి కారణమైంది. హనుమంతరావు గారిది విచిత్రమైన ప్రేమ. ఆయన దగ్గర ఏదో తెలియని ఆకర్షణ శక్తి ఉన్నది. ఆసియా ఖండంలోని అతి గొప్ప ముద్రణాలయం బి.యన్.కె.ప్రెస్. ఆ ప్రెస్ ముద్రణ కన్నా ధనికొండ గారి క్రాంతి ప్రెస్ ముద్రణే బాగుందనేవారు. ఎంతో పెద్ద అంతస్తుకు ఎదిగిన చక్రపాణి కూడా ధనికొండ ప్రెస్‌కు వచ్చి సిగరెట్ మీద సిగరెట్ కాలుస్తూ, టీ మీద టీ తాగుతూ చాలాసేపు ఇష్టాగోష్టి జరిపేవారు. అలాగే పిలకా గణపతిశాస్త్రి, ఎందరెందరో ప్రఖ్యాత రచయితలు ఆయన దగ్గర టీ త్రాగి కబుర్లు చెప్పకుండా వెళ్ళేవారు కాదు.

పత్రికాధిపతిగా, పత్రికా సంపాదకునిగా, కథారచయితగా, విలువలతో బాటు, మర్యాదను పాటించేవారు. తన పత్రికలో రచన ప్రచురించిన వారం రోజుల్లోనే పారితోషకం పంపడం ఆయన ఆచారంగా పెట్టుకున్నారు. ఎందరో రచయితల ఎదుగుదలకు ఆయన తోడ్పడ్డారు. ఆంధ్రదేశంలోని ప్రచురణకర్తలందరికీ ఆయన ఆపద్భాంధవుడు. కడప, కర్నూలు వివిధ పట్టణాల్నుంచీ ప్రచురణ కర్తలు తమ అముద్రిత గ్రంథాన్ని ఆ గ్రంధ ముద్రణ కయ్యే రొఖ్ఖం మొత్తాన్నీ ముందే యిచ్చి వెళ్ళిపోయేవారు. ఫలానా రోజున వచ్చి మీరు పుస్తకాల్ను తీసుకుని వెళ్ళవచ్చు- అని అంటే ఆ రోజు పిడుగు పడినా సరే- పుస్తకాన్ని సిద్ధపరిచి ఉంచేవారు. నికార్సయిన మనిషి. ఇవ్వవలసి వచ్చినా పుచ్చుకోవల్సివచ్చినా ఖరాకండిగా ఉండేవారు. ఆయన నన్ను అభిమానించినంతగా ఎవర్నీ అభిమానించలేదు. నేను కూడా ఆయన నవల్లో ప్రసిద్ధి పొందిన 'లోకచరిత్ర'ను ప్రచురించాను. నా పత్రికలు, పుస్తకాలు ఆయన వద్దే అచ్చయ్యేవి.

నేను 'మధురవాణి' సినిమా పత్రిక పెట్టే ముందు, 'ఇంత అమాయకుడవూ, లౌక్యమెరుగనివాడవు ఎలా నెగ్గుకొని వస్తావయ్యా' అనేవారు. నాకు రాజ్‌బాబు సినిమా రంగం తరపున సన్మానం చేసినప్పుడు, తాను కూడా చందమామ రామారావు గారితో ఊరేగింపులో నడిచి వచ్చారు. ●


**SRI RAJARAJESWARI JEWELLERY**

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653

*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*

# వల్లూరు శ్రీహరిరావు



తల్లిదండ్రులు: కీ॥శే॥వెంకట చలపతిరావు-అన్నపూర్ణమ్మ
జననం:5గురు సోదరీమణులకు ఏకైక సోదరునిగా నేను ది.29-11-1950, కృష్ణాపురం గ్రామము, పమిడిముక్కల మండలం, కృష్ణాజిల్లాలో పుట్టాను.
పెరిగిన స్థలం: పెదమద్దాలి, పామర్రు మండలం, కృష్ణాజిల్లా.ఎ.పి.
విద్యాభ్యాసం:ఆంధ్రమెట్రిక్యులేషన్, డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ యూనివర్శిటీ, రాజేంద్రనగర్, హైదరాబాద్
(సస్య రక్షణ మందుల కంపెనీలో ఉద్యోగ విరమణ)
భార్య : సూర్యకుమారి సంతానం : దీపిక,సాయిఫణి రామచంద్ర
గురువులు: శ్రీ వల్లూరి కామేశ్వరరావు, శ్రీ గుడివాడ నారాయణరావు, శ్రీ ఆర్.పి. జమ్మీబాబు, శ్రీ షణ్ముఖి రంగరాజు, శ్రీ నర్రా దామోదరరావు, శ్రీ కొడాలి వీరాంజనేయులు

కర్నాటిక్ హిందుస్థాని సంగీత సాహిత్యములు నెలవుగా ఉన్న కుటుంబం నుండి 1969 సం॥లో వల్లూరు కామేశ్వరరావు గారి స్ఫూర్తితో డా॥మంగళం పల్లి బాలమురళీకృష్ణగారి శిష్యరికంలో, శ్రీ అబ్బూరి వరప్రసాదరావు, శ్రీ షణ్ముఖి ఆంజనేయరాజుగారి నట జీవితంపై డా॥మిక్కిలినేని రాధాకృష్ణగారు రచించిన "నటరత్నాలు" చదివిన స్ఫూర్తితో నాటకరంగం ప్రవేశం చేసినవారు వల్లూరి శ్రీ హరిరావు. "సతీ సక్కుబాయి నాటకంలో జ్ఞానయోగి పాత్రలోను, వీరబ్రహ్మంగారి జీవిత చరిత్రలో సిద్ధయ్య పాత్రలోను "కచదేవయాని, రేణుకామహత్యం" నాటకముల్లో నారదుని పాత్రల్లోను, మహిషాసురమర్దినిలో శంకరునిగా, తులసీ జలంధరలో దేవేంద్రునిగా చింతామణిలో భవాని శంకరుడు బిళ్వమంగళుని పాత్రలోను, కురుక్షేత్రం, గయోపాఖ్యానంలలో శ్రీకృష్ణుని పాత్రను, శ్రీ రామాంజనేయ యుద్ధంలో శ్రీరామునిగా పలుపాత్రలు పోషించి ఆంధ్ర, ఆంధ్రేతర ప్రాంతాలలో పెక్కు సత్కారాలు, సన్మానాలు, బిరుదులు, అందుకున్న నటశీలి. జాతీయస్థాయిలో ప్రముఖ దినపత్రిక ప్రసంశలు, ఆకాశవాణి, దూరదర్శన్‌లలో విరివిగా పాల్గొని ఓ మంచి పౌరాణిక పద్య నటునిగా పేరు తెచ్చుకున్నారు.



1985లో శ్రీ శృంగేరీ పీఠాధిపతి, శారాదాపీఠం, శ్రీ భారతీ తీర్థస్వామి వారిచే శ్రీహరిరావు గానం చేసిన భక్తిరంజని క్యాసెట్స్ విడుదల వారి ఆశీస్సులను పొందారు.

విశాఖపట్టణం నగరాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో క్రియేటివ్ కామెడి క్లబ్ వారు ది15-02-2009, ది.1-7-2009 విశాఖలో ఘనసన్మానం చేశారు.

ఆంధ్ర ఎడ్యుకేషనల్ సొసైటీ, న్యూఢిల్లీ వారిచే 'జూనియర్ షణ్ముఖి' బిరుదమును, విశాఖ సమాచారం దినపత్రిక, విశాఖపట్నం వారిచే 'మధుర కంఠీరవ" బిరుదును ఉగాది పురస్కారమును అందుకున్నారు.

ఆశపు వీరేశ్వరరావు కళాపరిషత్ విశాఖపట్నం వారిచే "గాన కోకిల బిరుదు", బళ్ళారి రాఘవ మెమోరియల్ వారిచే బళ్ళారిలో 'కళారత్న' బిరుదమును అందుకున్నారు.

ఆంధ్ర పౌరాణిక నాటకరంగంలో షణ్ముఖి ఆంజనేయరాజు పేరు విననివారు, వెనకటి రెండు మూడు తరాల్లో ఆయన నాటకాలు చూడనివారు దాదాపుగా లేరనడం అతిశయోక్తి కాదు. అయితే, నటనలో హావభావ ప్రదర్శనలో, రాగయుక్తంగా పద్యాలు ఆలపించి ప్రేక్షకులను మెప్పించడంలో 'జూనియర్ షణ్ముఖి'గా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న మరో నటముత్యం వల్లూరి శ్రీహరిరావు.

శ్రీహరిరావు నటజీవితానికి నేపథ్యం. సంగీతం నేర్చిన కుటుంబం. ఆయన తండ్రి వల్లూరు వెంకట చలపతిరావు మృదంగ విద్వాంసుడు. కళలకు కాణాచి కృష్ణాజిల్లాలో నాటకరంగానికి ప్రసిద్ధిగాంచిన పామర్రు మండలం గుడివాడకు సమీపంలోని పెదపద్దాలి ఆయన స్వగ్రామం. తల్లి గారయిన అన్నపూర్ణమ్మ పుట్టింట 1950లో జన్మించారు. తొలినాళ్లలో పదోతరగతి పాసయ్యారు. తర్వాత హైదరాబాద్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రికల్చరల్ డిప్లొమా చేశారు. కొంతకాలం ప్రముఖ పురుగు మందుల కంపెనీలో పనిచేశారు. కానీ, మనసు నాటక రంగం నీడనే కోరుకోవడంలో ఉద్యోగానికి స్వస్తి చెప్పి నాటకరంగంలో పాదం మోపారు. అంతకు ముందే తండ్రి, పెదనాన్న కుమారుడు, గనుల ఇంజనీరు అయిన కామేశ్వరరావుల ప్రోత్సాహంతో విజయవాడ సంగీత కళాశాలలో గాత్ర సంగాతాన్ని అభ్యసించారు. ఆ రోజుల్లో దేవాలయాల్లో భజనలు, కచేరీలు విరివిగా జరుగుతూ ఉండేవి. సహజంగానే గాత్రమాధుర్యం కల శ్రీహరిరావు వీటిలో పాల్గొనడమే కాక, కీర్తనలు, తరంగాలు, అష్టపదులు దేవాలయాల్లో సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తుండే వారు. ఏకాహాలు, సప్తాహాలు, సప్తసప్తాహాలు కూడా నిర్వహిస్తుండేవారు. శృంగేరీ పీఠాధిపతి జగద్గురు శ్రీ భారతీతీర్ధస్వామి ఆశీస్సులతో భక్తి పాటలతో కూడిన ఆడియోకాసెట్లు స్వీయగానంతో రూపొందించారు. ఈ కాసెట్లు బహుళ జనాదరణ పొందాయి.

పౌరాణిక నాటకాలు చూసి చూసి తను కూడా నటుడు కావాలని పౌరాణిక రంగస్థలంపై తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకోవాలనీ అభిలషించారు. పద్యాలు, రాగాలే ప్రాణమైన పౌరాణిక రంగస్థలానికి తగిన లక్షణాలు, అర్హతలు శ్రీహరిరావుకు ఉండనే ఉన్నాయి. పౌరాణిక రంగస్థల అతిరథ మహారథులైన గుడివాడ నారాయణరావు, రేబాల రమణ, ఆర్పిజెమ్మిబాబు, కొడాలి వీరాంజనేయులు, షణ్ముఖరంగరాజు, నర్రా దామోదరరావు వంటి వారి వద్ద శిష్యరికం చేశారు. పద్మస్వర బ్రహ్మ అబ్బూరి వరప్రసాదరావు, గానగంధర్వ షణ్ముఖి ఆంజనేయరాజు, ఈలపాట రఘురామయ్య, మాధవ పెద్ది సత్యం, పిఠాపురం నాగేశ్వరరావు, ఆచంట వెంకటరత్నం నాయుడు, మద్దాల రామారావు. ఎ.వి.సుబ్బారావు, డి.వి. సుబ్బారావు వంటి అలనాటి రంగస్థల తారలతో కలిసి శ్రీహరిరావు నటించారు. పాత్ర ఏదైనా దానిలో ఇమిడి పోవడం ఆయన ప్రత్యేకత. నటించి మెప్పించడం ఆయనలోని ప్రావీణ్యత. ఇక సన్మానాలు, సత్కారాలు, బిరుదులకు కొదవేముంది? 1960 నుంచి ఇప్పటి వరకు వేలాది నాటక ప్రదర్శనలు ఇచ్చారు. సాంప్రదాయ పౌరాణిక పద్యాలతో హిందూస్థానీ, కర్నాటక, మరాఠీ బాణీలను మేళవించి ఆయన కురిపించిన సంగీత ఝురులు ప్రేక్షకుల మన్ననలు అందుకున్నాయి.

జూనియర్ షణ్ముఖి, గానకోకిల, మధురకంఠీరవ తదితర బిరుదులు వల్లూరి అందుకున్నారు. 1987లో ఎ.వి.ఎం. వారు ఆచంట వెంకటరత్నం నాయుడు సారధ్యంలో 'తులసీ జలంధర' నాటకం రికార్డింగ్ చేసినప్పుడు వల్లూరి అందులో దేవేంద్రునిగా స్వరం అందించారు. 1999లో హైదరాబాద్ నంది నాటకోత్సవాల్లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమదుగా సన్మానం అందుకున్నారు. శాసనమండలి ఛైర్మన్ ఎ.చక్రపాణి, డాక్టర్ సి. నారాయణరెడ్డి, మధ్యపాన విమోచన సమితి ఛైర్మన్ ఉప్పులూరి మల్లికార్జునశర్మ, పి.ఎల్.సంజీవరెడ్డి తదితరుల నుంచి సన్మానాలు, పురస్కారాలు అందుకున్నారు. తన ఈ విజయాల వెనుక తన ధర్మపత్ని సూర్యకమారి సహకారం, కుమారుడు సాయిఫణి రామచంద్ర, కుమార్తె దీపికల తోడ్పాటు ఎంతగానో ఉందని చెప్పే వల్లూరి శ్రీహరిరావు వంటి వృత్తి కళాకారులను ప్రభుత్వం, సేవాసంస్థలు ఆర్థికంగా ఆదుకుంటే బాగుంటుందని భావిస్తున్నాం. ●

# హిందూ మతోద్ధరణ ఆయన ధ్యేయం!

## అన్యమతీయుల మతప్రచారం నిరోధించాలనే ప్రగాఢ సంకల్పం

## - శ్రీ స్వరూపానందేంద్ర స్వామి వారి అకుంఠిత కృషి! -







దేశం హిందూ దేశం. హిందూ దేశంలోని హిందూ మతస్థులనెలాగైనా ప్రలోభపెట్టి, తమ మతంలో కలుపుకోవాలని క్రైస్తవ మత ప్రచారకులు విశేష కృషి చేస్తున్నారు. విచ్చలవిడిగా హిందూ ఆలయాల వద్దనే ప్రచారం చేస్తున్నారు. ఈ విషయాన్ని ప్రతీ హిందూ మఠాధిపతీ చూస్తూనే ఉన్నారుగానీ అరికట్టే మార్గాన్ని ఎవరూ ఆలోచించడం లేదు. ఎన్నో సాధుసమ్మేళనములకూ, మఠాధిపతుల సమావేశాలకు వెళ్ళాను. తీర్మానాలు చేయడం తప్ప ఆచరణకు దిగిన ఆచార్యులు కనిపించలేదు. ఈ విషయం విశాఖపట్నం చినముషిడివాడలో నున్న శారదా పీఠాధిపతి జగద్గురు శ్రీశ్రీ స్వరూపానందేంద్ర స్వామి వారికి బాధ కలిగింది. వెనుకపడిన జాతి వారిలో, గిరిజనుల్లో పేదతనమనండి, అమాయకత్వమనండి అన్య మతస్థులు ముఖ్యంగా క్రైస్తవ మత ప్రచారకులు పెట్టే ప్రలోభాలకు ఎరయై అన్యమత తీర్థం గ్రహిస్తున్నారు. ఎవరూ దీన్ని తీవ్రంగా పట్టించుకున్న ఆచార్యులు లేరు. యుక్త వయసులో ఉన్న విశాఖ శారదా పీఠాధిపతి జగద్గురు శ్రీ స్వరూపానందేంద్రస్వామి ఈ అన్య మత ప్రచారాన్ని అరికట్టాలని తీవ్రంగా ఆలోచించారు.

ముఖ్యంగా గిరిజన తండాల్లోని చాలామంది మతంమారే ప్రమాదం ఉందని గ్రహించారు. అన్యమత ప్రచారాన్ని అరికట్టాలంటే, వారికీ హిందూ మతంపై విశ్వాసం కలిగించే ప్రయత్నం చేయాలి. ఇది ఉపన్యాసాలతో కూడే పని కాదు.

హైందవ ధర్మప్రచారంలో భాగంగా ఆయన గురుదేవా ఛారిటబుల్ ట్రస్టును ప్రారంభించారు. మంగళంపాలెం గ్రామానికి చెందిన గిరిజనుల సంక్షేమార్థం శ్రీ గురుదేవా ఛారిటబుల్ ట్రస్టు ద్వారా వారికి పౌష్టికాహారం అందించడం, వైద్య సేవలు అందించడం వంటి సంక్షేమ కార్యక్రమాలు విరివిగా చేయడం, స్వయంగానూ, స్వయంసేవకుల ద్వారానూ వారి సంక్షేమాన్ని చూడడమే గాకుండా, పలు ప్రాంతాల్లో పర్యటించి హిందూ మత ప్రాశస్త్యాన్ని వివరిస్తూ, వారిలో అవగాహన కలిగేట్టు చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా నుంచీ ఇటు తూర్పు గోదావరి జిల్లా సముద్రతీర ప్రాంతాల్లోని మత్సకారులకు కూడా సహాయ సహకారములందించడం, ముఖ్యంగా గర్భిణీ స్త్రీలకు, శిశువులకు పౌష్టికాహారంతో బాటు వైద్య సేవలందించడం కూడా వారికి హిందూ మతం పట్ల విశ్వాసం పెరిగింది. గుమ్మం దాటి తిరుమల వంటి క్షేత్రాలను సందర్శించనివారిని శ్రీ వేంకటేశ్వరస్వామి మహిమల్ను తెలియచేస్తూ విశాఖ ఏజెన్సీకి చెందిన 500 మంది గిరిజనులను విశాఖ నుంచీ తిరుమల వెళ్ళే ఎక్స్‌ప్రెస్‌లో తిరుపతి యాత్రకు పంపారు. వారు బయలుదేరేముందు వారిని స్వరూపానందేంద్ర ఆశీర్వదిస్తూ వారికి రైలులో భుజించడానికి ఆహారం, నీళ్ళ బాటిళ్ళు యిచ్చి పంపారు. తిరుపతి చేరినవారు తిరుమల కొండ నధిరోహించిన వారికి వేంకటేశ్వరస్వామి దర్శనం చేయించిన తరువాత వారికి తిరుమలలోని శ్రీ స్వరూపానందేంద్ర స్వామి వారి వసతి భవనంలో భోజనం పలహారాలు పెట్టించి, తిరుగు ప్రయాణంలో వారిని విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో వారి నివాసాలకు చేరేట్టు చేసారు. ట్రస్టు ఛైర్మన్ రాపర్తి జగదీశ్ బాబు, సభ్యులు గిరిజన యాత్రకెంతో ప్రోత్సాహమిచ్చారు.





ఇంతవరకూ చరిత్రలో ఎవరూ చేయని మంచి పనిని శ్రీ స్వరూపానందేంద్ర స్వామి చేసి దళితులు, మత్సకారులను, గిరిజనులను అన్యమతంలోకి చొరబడ కుండా హిందూ మతాభిమానులుగా చేయడమనేది ఓ శుభనాందీ గీతం. ఈ మంచి మార్గంలో స్వామివారు తీసుకున్న చొరవకు, చక్కని తలంపుకూ మా వందనములు తెలియ చేస్తూన్నాం. శ్రీ స్వామివారికి తిరుమల, కాశీ, ఋషీకేశ్, హరిద్వార్ క్షేత్రాల్లో వసతి భవనాలున్నాయ్. ఈ సంవత్సరం చాతుర్మాస దీక్షను స్వామి వారు ఋషీకేశ్‌లో చేస్తున్నారు. ●

# విద్యార్థులను ఉద్యమాల్లోకి దింపవద్దు!

## -గాంధీజీ ఈ విషయంగా తప్పుచేశానని అంగీకరించారు!! -

దేశంలోని నీతి బాహ్యపు నాయకులు విద్యార్థులను ఉద్యమాల్లోకి ప్రోత్సహించి, యువతకు హింసామార్గ నిర్దేశనం చేస్తున్నారు. 'అన్నపూర్ణ' వంటి ఆంధ్రదేశం అభాగ్యదేశంగా మారడానికి ఈనాటి నాయకులు కారణమని విద్యార్థులూ, వారి తల్లితండ్రులూ గ్రహించాలి. 1921 సం॥ములో గాంధీజీ ప్రారంభించిన తొలి మెట్టుగా ట్రిపిల్ బాయ్‌కాట్‌గా మూడు రకాల సహాయ నిరాకరణం చేయమని, పౌరులందర్నీ ప్రేరేపించారు.



శాసనసభలకు, కోర్టులకు, విద్యాలయాలకు వెళ్ళవద్దని- ఇదేదో అహింసా మార్గపు సత్యాగ్రహమని నిర్దేశించారు. విజయవంతంగా ఈ ఉద్యమాన్ని మూడు వర్గాల వారు కలిసి చేసిననాడు ఒక సంవత్సరములోనే స్వాతంత్ర్యం సాధించవచ్చుననే 'భరోసా' ప్రజల్లో కలిగించారు. ఉత్తర హిందూస్థానం నుంచీ దక్షిణ దేశం వరకూ ఈ ఉద్యమం వేడివేడిగా వాడివాడిగా తీవ్రదశకు చేరుకున్నది. పాఠశాలల్లోని విద్యార్థులందరూ విద్యాలయాల్నుంచీ బయటకు (వాకౌట్) వచ్చారు. వచ్చిన వారెవరైనా శాంతియుతంగా ఉద్యమం నడిపారా- అంటే లేదు. ఉత్తర హిందూస్థానంలోని చోరాచోరీ అనే గ్రామం పోలీసుస్టేషనుపై బడి, స్టేషన్‌ను తగులబెట్టారు. ఈ ఉద్యమం అహింసాయుతంగా జరపాలనుకున్నారు గాంధీజీ. కానీ ఆయన ఆశించిన ఆశ అడియాస అయింది. ఇలా దేశంలో అనేక చోట్ల ఉద్ధృత వాతావరణం ప్రజరిల్లింది. ఇదే మంచి అదునుగా భావించి విద్యార్థులు పాఠశాలలకు వెళ్ళడం మానివేసారు.

దానితో గాంధీ ఆలోచనలో పడ్డారు. విద్యార్థి దశలో వారిని రాజకీయాల రొంపిలోకి దిగనిస్తే అటు వారి విద్యా విజ్ఞానాలకు భంగం వాటిల్లుతుందని, హింసను అదుపు చేయలేమని భావించారు. అదే తప్పు తెలంగాణా ఉద్యమంలో జరిగింది. కానీ ఏ ఒక్క నాయకుడూ గ్రహించడంగానీ, గర్హించడం గానీ చేయక పోవడంతో దేశానికి ఎంతో నష్టం కలిగింది. ఖజానా కాలీ కావడం జరిగింది. ●

# సమాజ హితైషుడూ, సేవాభావం కల డా॥సత్యనారాయణ (బాబ్జీ) పాలకొల్లు కే గర్వకారకుడు!

అందరూ ఆయన్ను అబ్బాయి గారంటారు. మరి కొందరు 'బాబ్జీ' గారంటారు. ఎవరెలా పిలిచినా ఆయన ప్రజాహితైషుడైన గుణశీలి. డా॥ఆచంట పెదగోపాలం తరువాత అంతటి ఉదార స్వభావుడైన 'డాక్టరు' వస్తాడా? పాలకొల్లులోని వారికి పాల మనసుతో పౌరులకు సేవలు చేసేవాడుంటారా– అనుకున్నా, అంతకన్నా అయిదురెట్లు ఆదర్శభావకుడూ, ఆర్యధర్మపరుడూ, వైద్యనారాయణునిగా ఓ సత్య నారాయణుడు వెలిసాడు. ఆయనే డాక్టరు బాబ్జీ. నిలువెత్తు మనిషి నిరాడంబరుడు. ఇచ్చే చేయేగానీ, పట్టుబట్టి రోగిని పీడించే చేయగల డాక్టర్ కానే కాదు.

చికిత్స, శస్త్ర చికిత్సలు చేస్తూనే, సమాజంలోని కుళ్ళు, సంకుచితత్వాలకు కూడా చికిత్స చేస్తున్నాడు. ఆయనకు చిరునగవే సిరులొలికిస్తుంది. డా॥ త్సవటపల్లి సత్యనారాయణమూర్తి హస్తవాసి కల వైద్యుడు. చిత్త శుద్ధిగల మనస్కుడు.

ఆయన జీవితంలో ఎన్నో ధక్కాలు తిన్నా చలించలేదు. ధృడ మనస్సు, దీన జనసేవ ఆయన లక్షణాలు. ఒక రకంగా చెప్పాలంటే దీనబంధు. ఆయన తన వైద్యాలయంలో చికిత్సలు చేస్తూనే పాలకొల్లులోని లయన్స్ నేత్ర చికిత్సాలయంలో 2 లక్షల మందికి నేత్ర చికిత్సలు చేసాడు. ఈ సందర్భంలో ఆయన్ను ఘనంగా సత్కరించినట్లు తెలిసి ఆనందమందుతున్నాను. ఆ సత్కరిస్తున్నదీ కూడా నా



బాల్యమిత్రుడూ, లయన్స్ నేత్ర చికిత్సాలయానికి భూదానం చేసిన బొండాడ వెంకట రాధారమణగుప్త. ఇరువురూ ప్రముఖాంధ్ర అభిమానులే!

పంచారామ క్షేత్రంలోని ప్రసిద్ధ క్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరుడీ ఇరువురి కుటుంబాల వారికి ఆయురారోగ్య ఐశ్వర్యములు ప్రసాదించాలని ఏడుకొండల వాడిని కోరుకుంటున్నాను. ●

# తమిళ సాహితీ వతంసులపై తమిళులకు కల అభిమానం, గౌరవాలు తెలుగువారికి లేవు!

తిరువళ్ళువారు సూక్తులకు భ్రమసి, కన్యాకుమారిలోని మూడు మహాసాగరముల సంగమ ప్రదేశంలో 6 కోట్ల రూపాయల్ను వెచ్చించి 133 అడుగుల ఎత్తుగల తమిళకవి వళ్ళువార్ శిలా విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మొన్న వచ్చిన సునామికి కూడా ఈ విగ్రహం చెదరలేదు. ప్రభుత్వపు బస్సుల్లో కూడా వళ్ళువార్ చిత్రములను విధిగా వేలాడిస్తారు. వారికి మాతృభాషాభిమానం ఎక్కువ.

ప్రపంచ వ్యాప్తి గన్న తెలుగు సాహిత్యంలో ఎందరో మహత్మువులున్నారు! కానీ ఎక్కడ?


టాంక్ బండపై ప్రతిష్ఠించిన కవుల సాహితీవేత్తల విగ్రహాలను తొలగించి దుష్టసంస్కృతీ వారసులయ్యాం.

అందుకే మనవారు ఎప్పుడూ ఆత్మగౌరవం గురించి మాట్లాడవద్దు. అందుకు అర్హులు కారు అంటున్నాను.

**అలల నడుమ వళ్ళువార్ అద్భుత విగ్రహం.**

133 అడుగుల ఎత్తు...7000 టన్నుల బరువు... 6 కోట్ల రూపాయల వ్యయం...

చుట్టూ విశాలమైన సముద్రం. మధ్యలో ఆకాశాన్నంటేలా భారీ విగ్రహం. ఎక్కడో కాదు మన దక్షిణ భారతదేశంలోనే. మీరు కన్యాకుమారి వెళ్లి ఉంటే 'ఇది తిరువళ్లువర్ విగ్రహం' అని చటుక్కున చెప్పేస్తారు. సముద్రంలోని చిన్న శిలాదీవిపై ఏకంగా 133 అడుగుల ఈ భారీ విగ్రహాన్ని



ఆధునిక భారతీయ శిల్ప కళా కౌశలానికి అద్దం పట్టేలా అద్భుతంగా చెక్కారు. దీని నిర్మాణం కోసం ప్రఖ్యాత శిల్పకారుడు గణపతి స్థపతి ఆధ్వర్యంలో 150 మంది శిల్పులు, 350 మంది పనివారు పదేళ్లపాటు శ్రమించారు. దీని మొత్తం బరువు 7000 టన్నులు. అంటే సుమారు 400 ఏనుగుల బరువుకు సమానమన్నమాట. ఈ భారీ విగ్రహం ఏర్పాటుకు 6.14 కోట్ల రూపాయల వ్యయం అయ్యింది.

1979లో అప్పటి ప్రధాని మొరార్జీ దేశాయ్ దీనికి శంఖుస్థాపన చేశారు. కానీ 1990 వరకూ పని ప్రారంభం కాలేదు. 2000 జనవరి 1న మూడు సాగరాల సంగమైన కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్ పక్కనున్న రాతి కొండపై విగ్రహాన్ని నిలబెట్టారు.

అసలు తిరువళ్లువార్ ఎవరో తెలుసా? పేరుగాంచిన ప్రాచీన తమిళ కవి. ఆయన భక్తి రచనల ద్వారా మంచిని బోధించారు. ఈయన రచించిన 'తిరుక్కురళ్' గ్రంథంలో మొత్తం 133 అధ్యాయాలు ఉన్నాయి. దానికి సూచికగానే గద్దెతో సహా విగ్రహాన్ని 133 అడుగులుగా మలిచారు. ఇందులో గద్దె ఎత్తు 38 అడుగులు, విగ్రహం 95 అడుగులు ఉంటుంది. ఆసియాలోని అతి పెద్ద విగ్రహాల్లో ఇదీ ఒకటి.

ఈ విగ్రహం చేయడానికి తమిళనాడులోని మూడు ప్రాంతాల నుంచి నాణ్యమైన గ్రానైట్ రాయిని తెప్పించారు. ముఖమే ఏకంగా 19 అడుగులుంది. ఏక శిలతో చేయడం సాధ్యం కాక, చెవులు, ముక్కు, కళ్లు దేనికది విడివిడిగా చెక్కారు. వాటిని అంతెత్తున అతికించడానికి 18 వేల కర్రలను, 2 ట్రక్కుల తాళ్లను వాడారు. శిల్పులు మొదట కలపతో ఒక నమునా విగ్రహాన్ని చేసి, దాని ఆధారంగా రాతి శిల్పాన్ని. భారీ భూకంపాల్ని కూడా తట్టుకునేలా రూపొందించారు. 2004లో వచ్చిన భయంకరమైన సునామీ ధాటికి కూడా ఇది చెక్కు చెదరలేదు. ●



# అశేష కీర్తి గిరి చిత్రాల కొండపల్లి శేషగిరిరావు

కొండపల్లి బొమ్మలు ఈ తరం వారికి కొత్తేమోగాని పాతతరం వాళ్ళ ఇళ్లల్లో కొలువు తీరి ఉంటాయి. ప్రత్యేకించి బొమ్మల కొలువుల్లో ఆ కొయ్య బొమ్మలు కొండపల్లి బొమ్మలు ఉండి తీరాల్సిందే. అంతలా ప్రాచుర్యం పొందిన కొండపల్లి బొమ్మలు చూడటానికి అచ్చం కొండపల్లి శేషగిరిరావు గీసిన బొమ్మల్లానే ఉంటాయి. అంతలా జీవకళ ఉట్టిపడుతుంటుంది. ఆదరణ కరువై కొండపల్లి బొమ్మలకు గిరాకీ తగ్గిందిగానీ అంతర్జాతీయ స్థాయికి ఏ మాత్రం తగ్గవు కొండపల్లి బొమ్మలు. అంతగా గుర్తుకుతెచ్చే కొండపల్లినే ఇంటిపేరుగా చేసుకుని శేషగిరిరావు అనే ప్రసిద్ధ చిత్రకారుడు తన విశేష పేరు ప్రతిష్టలు ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం చేయక యావత్ భారతావని మెచ్చే స్థాయికి వ్యాప్తి చెందడమంటే అంత తేలికైన విషయం కాదు. ఎనిమిది పదుల వయసులోనూ వన్నెతగ్గని కళాఖండాలను ఎంతో సృజనాత్మకంగా తీర్చిదిద్దుతుంటారు ఆయన. ఇంటిపేరు కొండపల్లి అయినా శేషగిరిరావు పుట్టింది మాత్రం తెలంగాణాకే తలమానికమైన వరంగల్ జిల్లాలోని పెనుగొండలో 1924 సంవత్సరములో జన్మించారు. పెనుగొండలో ప్రాథమిక విద్యాభ్యాసం చేసి వరంగల్ ప్రాంతంలో ఉన్నత విద్యను అభ్యసించారు.

ఆయన పౌరాణిక, దృశ్య, కావ్య నాయకానాయికలను, మనసుకు హత్తుకుపోయే వివిధ సుందర దృశ్యాలను మనోహరంగా చిత్రించడమే కాక కుడ్య చిత్రలేఖనంలో కూడా శేషగిరిరావుకు సాటి ఆయనే అనిపించుకొన్నారు.

కోటి రత్నాల వీణ తెలంగాణాలో వేయిస్తంభాల గుడి, అరుదైన చారిత్రక కళాసంపదను చాటుతున్న వరంగల్ ప్రాంతంలో జన్మించిన కొండపల్లి శేషగిరిరావు చిన్నతనంలోనే సామాన్య శాస్త్రంలో గీయవలసిన బొమ్మల్ని తన పాఠ్య పుస్తకంలో ఉన్నదానికన్నా ఎంతో అందంగా చిత్రించేవారు. చిన్నతనంలోనే కొండపల్లి శేషగిరిరావులో ఉన్న సృజనాత్మకతను పరిశీలించిన ఆ పాఠశాల డ్రాయింగ్ మాస్టర్ అయిన దీనదయాళ్ ఆనాడే కొండపల్లి గొప్ప కళాకారుడవుతాడని గ్రహించారు. దీంతో కొండపల్లి కళాచతురతను ప్రప్రథమంగా ఆ పాఠశాల డ్రాయింగ్ టీచరు దీనదయాళ్ గుర్తించారు. పెన్సిల్‌తో ఏ రేఖలు ఎలా గీయాలో, కుంచెతో ఏ రేఖల్లో జీవం ఎలా నింపాలో దీనదయాళ్ మన కొండపల్లికి నేర్పారు. చుట్టూ వ్యాపించి ఉన్న కళాసంపద ఆయన కళాభిమానాన్ని తట్టిలేపింది.













వేయిస్తంభాల గుడిలోని ప్రతిస్తంభం ఆయనకు రోజుకో పాఠం చెప్పింది. రామప్ప గుడి ఆయన్ని తన హృదయాంతరాలలో నింపుకుంది. ఆ గుడిలోని శిల్ప సౌందర్యం... శిల్ప కళాక్షేత్రాల శిల్ప కళా సొగసులను సుదీర్ఘ, సునిశిత అధ్యయనంతో తన సొంతం చేసుకున్న కొండపల్లి వాటి నుంచి స్ఫూర్తి పొంది కొన్నివందల చిత్రాలతో ఆ శిల్పకళకు దర్పణం పట్టారు. శిల్పుల మనోగతాల్ని, వారి అభిరుచిలో తొంగిచూసిన ప్రత్యేకతల్ని, విశిష్టతల్ని తాను అవగతం చేసుకోవడమే కాక ప్రజాబాహుళ్యానికి చాటే ప్రయత్నం చేశారు. వరంగల్‌లో విద్యాభ్యాసం, చిత్రకళాభ్యాసం తర్వాత ఆయన హైదరాబాద్‌కు చేరుకున్నారు. హైదరాబాద్ చిత్రకళాశాలలో డిప్లొమా పొందారు. హైదరాబాద్‌లో ఉన్న సమయంలోనే ఆయనకి రవీంద్రనాథ్ ఠాగూర్ స్థాపించిన శాంతినికేతనంలో అధునాతన చిత్రకళా రీతుల్ని అధ్యయనం చేయడం వల్ల తగిన ఫలితం ఉంటుందని సూచించి, కొందరు సహకరించడంతో కొండపల్లి 'శాంతినికేతన్'లో ప్రవేశించారు. సర్వకళలకు పుట్టినిల్లయిన శాంతినికేతన్‌లో అప్పుడు నందలాల్‌బోస్ చిత్రకళా విభాగంలో ఉండేవారు. ఆయన కొండపల్లి కళాప్రతిభని గుర్తించారు. పాటించాల్సిన జాగ్రత్తలేమిటో నేర్పారు. ఆయన నేర్పిన మెలకువలతో కొండపల్లి ప్రతిభ బాగా వికసించింది. అక్కడే 'కుడ్య' చిత్రలేఖనంలో కూడా కొండపల్లి ప్రత్యేక శిక్షణ పొందారు.

1950లో హైదరాబాద్‌లో చిత్ర కళాపోటీలు భారీ ఎత్తున జరిగాయి. అఖిలభారత స్థాయిలో జరిగిన ఆ పోటీల్లో కొండపల్లి చిత్రం ప్రథమ బహుమతి పొందింది. ఆ సభలో పాల్గొన్న అప్పటి మంత్రి, కొండపల్లి చిత్రాన్ని ప్రశంసించడమే కాక హైదరాబాద్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్సులో అధ్యాపకుడిగా కొండపల్లి శేషగిరిరావు పేరును ప్రతిపాదించారు. అలా ఉద్యోగం చేపట్టిన కొండపల్లి శేషగిరిరావు ఎంతోమంది శిష్యులను తయారు చేశారు. ఆయన కళాత్మకత రాజకీయ నాయకులను విశేషంగా

(తరువాయి 22వ పేజీలో)

# తెలుగు పల్లెలో ప్రభవించిన కాలజ్ఞానం!

**తొలి కూడి కూసింది తెలవారింది** – ఇది ఆనాటి విషయం. పల్లె వాతావరణంలో ప్రభవించిన సత్యం. అప్పటికింకా సూర్యుడు రాడు. బొగ్గు రాసినట్టుగా పెను చీకటి ఉంటుంది. పల్లెటూరి పడతులు లేవడానికి బద్ధకం చూపుతారేమోనని కోడిని కర్తగా తెచ్చుకుని కొక్కొరోరో అని కోడి కూసింది, కోకల్ని కట్టిన కోమలులు, పావడా పరికిణీ లేసుకున్న పిల్లలంత లేచారు. దీనిని మన తెలుగు కవులు ఎంతో చక్కటి అక్షరాలను పూరించి: వర్షం హర్ష తేజంతో వెళ్ళిపోయింది అంటారు.

జలదానం చేసిన మేఘాలకి నేలతల్లి మబ్బు రథాలెక్కి జేజేలు చెప్పింది. చరచరాలు తెప్పరిల్లాయి.చేలన్నీ చిలకాకుపచ్చ చీరకట్టాయ్. ఉల్లిపూ ఛాయలో సూర్యుడు రేకలేస్తున్నాడు. భూమిలో ఉన్న చిన్న గింజ (విత్తనం) పురుటి బిడ్డ మెడను బయట పెట్టింది. అప్పుడే విప్పారిన రెండు ఆకులూ చేతులూ జోడించి, వెడూతున్న మేఘాల వైపు కృతజ్ఞతాంజలి చేస్తున్నట్లున్నాయి. సాహిత్య కారులెపుడూ ప్రకృతీ ఆరాధకులు కదా! ఇలాటి కవితలకు వేదమునే ప్రామాణికంగా తీసుకున్నారు. **గ్రీష్మకాలే దావాగ్ని నా దగ్ధ ప్రదేశీ చిరకాలే వర్షత్రే వృష్టి పతనేన్– యస్య కోమలయుక్తాశ్చ ఓషధః ప్రజాక్ష్మీస్తే'** అన్నది–

గ్రీష్మ ఋతువులో విపరీతమైన ఎండల కారణంగా బుగ్గియైన నేలను వర్షం పడిన అనంతరం కోమలమైన చిలకపచ్చని చీరకట్టుకున్న ఔషధమూలికల్నీ, ఆహారపు ధాన్యాన్నీ, కాయకూరల్నీ అధికసంఖ్యల్లో పుటుకొస్తాయని వేదం చెప్పింది. పర్జన్యుడు పనికట్టుకుని వానల్ని ప్రేరేపిస్తాడు. వాన యొక్క ప్రయోజనం నేలకు పరమసార్థక్యమైంది. ఋతుపరిణామానికిదే ధన్యత. అందుకే మా చిన్నతనంలో పిల్లలు వాన చినుకల ఆరంభంలో ఆరు బయటకు వచ్చి **వానల్లు కురవాలి! వరిచేలు పండాలి! మా అమ్మ వండాలి! మా కడుపు నిండాలి! ఋడుగో ఋడుగో** అంటూ పాడేవారు.

ఏ మేఘమెలా కొట్టి కురుస్తుందో అప్పటి గ్రామీణులకు తెలుసు. కురిసే మేఘమేదీ, మురిపించే మేఘమేది, రాత్రి చంద్రుని చుట్టూ గూడు కట్టుకుని పచార్లు చేసిన మేఘం మెరుములు మెరిసి ఉరుములురిమి, వాయుదేవుడి ధాటికి మరో దిశకు పోతుందా యని ప్రతీ గ్రామపౌరుడూ చెప్పేవారు. ఆనాడు వాతావరణ విశేషకులున్నారా, ఏమైనా ముందుగా చెప్పడానికి– ఎవరూ లేరు. దశా నిర్దేశం చేయడానికి అక్కడక్కడ గాలి చక్రాలుండేవి. పక్షులు సంకేతాలిచ్చేవి.

కాలగమనం తెలుసుకోవడానికందరిళ్ళలోనూ గడియారాలుండేవి కావు. వీధిలోని ఎండలో నిలబడి, చెవులవద్ద చేతులుంచుకుని, ఒక్కొక్క అంగనే వేస్తూ సూర్యభ్రమణాన్ని బట్టి కాలసమయం చెప్పేవారు. గడియారమైనా కాలం తప్పు సూచన చేయవచ్చుగానీ వారి లెక్క తప్పు చెప్పదు. భూమి కొలతలూ అలాగే కొలిచేవారు. వారే సర్వేయర్లు. లెక్క చెప్పడంలో తప్పడం ఉండేది కాదు.

ఈనాటి అక్షరాశ్యుల కన్నా, ఆనాటి అక్షరం రాని వారే ఎంతో జ్ఞానులు. వారికి పురాణ, ఇతిహాసాలు అన్నీ కంఠోపాఠమై ఉండేవి. సంసార జీవితం గడుపుతూ కర్మమార్గాన్ని అనుసరించే వారుండేగడ్డ తెలుగుగడ్డ. ఇతరులకు ప్రియమూ హితంగానూ, ఉద్వేగరహితంగానూ, ఉపకారబుద్ధితో ఉండే తెలుగు ప్రజలు ప్రపంచ అభివృద్ధిని కాంక్షించేవారు.

**చరాచరస్య విశ్వస్య యథాఽధారోవసుంధరా**
**నిఖిలానాం గుణానాం చ తథా శీలం శుభాశ్రయః**

– ఈ చరాచర జీవరాశికి భూమి ఆధారమైనట్టు, సకల సద్గుణాలకూ శీలమే ఆధారం– అలాటి సద్గుణవారాశికి తెలుగువారే కీలకాధారం. ఇపుడే వారే అవరోధంగా ఉండడం బాధాకరం! ●

## విశ్వనాథ జ్ఞాపకాలు



విశ్వనాథ సత్యనారాయణ 1895లో కృష్ణాజిల్లాలోని నందమూరులో జన్మించారు. ఈయన రచన 'రామాయణ కల్పవృక్షం' జ్ఞానపీఠ పురస్కారాన్ని పొందింది. కళాప్రపూర్ణ, కవి సామ్రాట్ బిరుదులు పొందిన విశ్వనాథ 1976లో మరణించారు.

మాది వైదిక బ్రాహ్మణ కుటుంబం. బాల్యం నుంచే నాకు జ్యోతిష్యం పైన నమ్మకం ఎక్కువ. మనుషుల జీవితాలు గ్రహాల ప్రభావాలపై ఆధారపడి ఉంటాయని నా నమ్మకం. మా నాన్నగారు శోభనాద్రిగారి శివభక్తులు. ఆయన 1902లో బెనారస్ నుంచి శివలింగాన్ని తెచ్చి నందమూరులో ప్రతిష్ఠించి ఆలయాన్ని కట్టించారు. నాకు పదకొండేళ్ల వయసులో వరలక్ష్మమ్మతో పెళ్లయింది. పన్నెండేళ్ల వయసులో ఆరోతరగతిలో చేరాను. అప్పటికే నాకు భాగవతం, మనుచరిత్ర కంఠతా వచ్చు. సహాయ నిరాకరణోద్యమ కాలంలో నా చదువు కొంతకాలం ఆగిపోయింది. చివరకు 1929లో మద్రాసు యూనివర్శిటీ నుంచి సంస్కృతంలో డిగ్రీ పూర్తి చేశాను. 14 ఏళ్ల వయసునుంచి కవిత్వం రాయడం మొదలు పెట్టాను. 1929 నాటికే నాకు పెద్ద కవిగా పేరొచ్చింది. కాలేజీలో చదువుకునే రోజుల్లో చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి, కాటూరి వెంకటేశ్వర రావు, పింగళి లక్ష్మీకాంతం, వేటూరి ప్రభాకర శాస్త్రి, వేలూరి శివరామశాస్త్రి నాకు సహాధ్యాయులు. సాహిత్య కార్యక్రమాల్లో మా మధ్య ఎప్పుడూ పోటీ ఉండేది. ఉపాధ్యాయుడిగా ప్రారంభమైన నా ఉద్యోగ జీవితం 1961లో కరీంనగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదవీ విరమణతో పూర్తయింది. నా పూర్తి సమయాన్ని రచనలకే అంకితం చేశాను. ●

*(21వ పేజీ తరువాయి)*

ఆకట్టుకోవడంతో హైదరాబాద్, బెంగళూరు, భావనగర్‌లలో జరిగిన ఆలిండియా కాంగ్రెస్ కమిటీ సమావేశాలకు ద్వారాలు, వేదిక రూపకల్పన బాధ్యతలు కొండపల్లికి అప్పగించారు. అవి అప్పటి ప్రధానమంత్రుల అభినందనలు అందుకొన్నాయి. అప్పటి ప్రభుత్వం చొరవతోనే ఆయన "లైఫ్ ఆఫ్ ఆంధ్ర" అనే బృహత్తర చిత్రాన్ని చిత్రించారు. అది అనేక పర్యాయాలు రవీంద్రభారతి, తెలుగు లలిత కళాతోరణం వంటి వేదికల మీద జరిగిన కార్యక్రమాల్లో ప్రదర్శితమై ప్రేక్షకులను బాగా ఆకర్షించింది. ఆయన ఉపాధ్యాయుడిగానే మిగిలిపోకుండా చిత్రకళా విస్తృతికి ఎంతో కృషిచేశారు. పత్రికల్లో విరివిగా వ్యాసాలు రాశారు. చిత్రకళకు సంబంధించిన దాని అనుబంధ కళలపై ఎన్నో గ్రంథాలు కూడా రాశారు. 1982లో ఉద్యోగ విరమణ అనంతరం కూడా తన దగ్గరకొచ్చే వారిని నిరాశపరచక మెలకువలన్నీ నేర్పారు. 1987 మే ఆరో తేదీన హైదరాబాద్‌లో 'మాడపాటి సుకుమార్' అవార్డు అందుకొన్న కొండపల్లి చిత్రకళా సాధన. బోధనల్లో కొండపల్లి బొమ్మలంత సుస్థిర కీర్తిప్రతిష్ఠలను పొందారు. మాస్కో, లండన్, అమెరికా దేశాలలో శేషగిరిరావు చిత్రాల ఆర్ట్ ఎగ్జిబిషన్లు జరిగాయి. లలిత కళా అకాడమీ ఫెలోషిప్ పొందిన శేషగిరిరావు తన జీవిత ధ్యేయం పౌరాణిక చిత్రాలను ఎంతో హృద్యంగా చిత్రీకరించడమేనంటారు. కాళిదాసుని అభిజ్ఞాన శాకుంతలానికి సంబంధించిన సుమనోహర చిత్రాలు శేషగిరిరావుకు ఎంతగానో ఖ్యాతిని తెచ్చిపెట్టాయి. ●

# కొన్నాళ్లకు చెన్నయ్ రోడ్ల మీద కారులే గానీ మనుష్యులు కనపడరు!



చెన్నయ్ మహానగరంలో కోటీశ్వరులు పెరుగుతారో, పెరగరో కానీ కోట్ల కొద్దీ కారుల పరుగులు పెరుగుతాయ్.

వందేళ్ళక్రితం ఒక్క కారూ తిరగని నేతాజీ సుభాస్‌చంద్రబోస్ రోడ్, మౌంట్ రోడ్, కొత్తగా రద్దీ రహదారీ ప్రాంతమైన కోయంబేడు, త్యాగరాజనగర్, గిండీ, తాంబరం, వేలాచ్చేరీ రోడ్లలో వేలకొద్దీ కార్లు నడుస్తూ, మనిషి నడవడానికి చోటు లేకుండా చేస్తున్నాయ్. ఇక ట్రక్కులూ, బస్‌లూ, లారీలూ, ద్విచక్ర, త్రిచక్ర, వాహనాల్ను గనుక లెఖ్ఖలోనికి తీసుకుంటే నర సంచారానికి అవకాశం లేకుండా పోతుంది. జనం పెరిగారా, కార్లు పెరిగాయా అనే డిబేట్ కనుక పెడితే, కారులనే సమాధానం వస్తూంది. అందుకే అమెరికా హైరోడ్‌ల్లో కారులూ, ట్రక్కులూ, బస్సులూ తక్క నరులను నడవనీయరు. అథవా ఎవడైనా తెలియకో, త్వరగా దాటుదామని వచ్చినా, వాడిమీద ఏ కారో ట్రక్కో ఎక్కుతుంది. దానితో వాడి పని తా! దీనికి కేసు కూడా ఉండదు. చైనాలో గత ఏడాది కార్ల రద్దీతో 100 కిలోమీటర్ల మేర రహదారి కార్లతో నిండిందన్న వార్త గిన్నీస్ రికార్డు పుస్తకానికెక్కింది. 2010 సం॥ములో 101.5 కోట్ల వాహనాలున్నట్లు నమోదయింది. వీటిలో రోడ్డుమీదకు రాని వాహనాల లెక్క రానే లేదు. ఇప్పుడున్న ఈ కార్లూ, లారీలు, ట్రక్కులను (ఆటో గీటో బస్సులను మినహాయించెయ్యండి) ఒకదాని వెనుక మరొక వాహనాన్ని నిలిపితే భూమి చుట్టూ 45 సార్లు చుట్టినట్టవుతుందంట. లేదా వీటన్నిటినీ ఒకదానిపై నొకటి పేర్చి నిలబెట్టకలిగితే ఆకాశంలోని చంద్రుని గమనాన్ని నిలుపవచ్చుట. 1970 సం॥ములో ఈ వాహనాల సంఖ్య 25 కోట్లు. ఆ సంఖ్యను చేరడానికి 85 ఏళ్ళు పట్టిందంటున్నారు. అదే 1986కు 50 కోట్లకు పెరిగిపోయింది! ఇప్పుడు వందకోట్లకు పైగా వాహనాలు భూచక్రమ్మీద నడుస్తున్నాయని అంచనా వేస్తున్నారు! ప్రపంచంలోని కార్ల కర్మాగారాలు నుంచీ సంవత్సరానికి 5 కోట్ల పెద్ద కార్లే వస్తున్నాయట. జనాభా విషయంలోనే కాదు, కార్ల విషయంలో కూడా చైనాయే మొదటిస్థానంలో ఉన్నది. అమెరికాలో సగటున మనిషికో కారున్నది. క్రీస్తుపూర్వం రోమ్‌లో కార్లు ఇలా పెరిగేసరికి నగరాలలో కార్లు తిరగడానికి వీల్లేదు అన్నారట. అలా మనం అనగలమా? అని మనగలమా! ప్రతిపక్షాల రాస్తారాకోలు, బంద్‌లూ పెరిగిపోవూ! అమ్మమ్మో! ●

# తొలి గురుకులాభ్యాసం తల్లిదండ్రులతోనే ప్రారంభమవుతుంది!

ప్రపంచంలోకి మనల్ని పంపింది నాన్న. ఆ అమ్మానాన్నల నడకలలో నడుస్తూనే ఇంతటివారం అయ్యాం... ఇంతై... ఇంతింతై ఎంతటివారమో అయ్యాం. అమ్మకు మించిన ఆత్మ లేదు... నాన్నను మించిన గురువు లేడు. అమ్మతోనే ఆత్మీయ ప్రపంచం రంగులు దిద్దుకుంటుంది. నాన్న దిద్దించిన అక్షరాలతోనే ప్రపంచం తలుపులు తెరుచుకుంటాయి. మన వ్యక్తిత్వ వికాసంలో, క్యారెక్టర్ బిల్డింగ్‌లో తండ్రే తొలి గురువు. తండ్రి తర్వాతే తక్కిన ప్రాపంచిక వ్యక్తిత్వాల ప్రభావం. అందుకే "Father is more than hundred school teachers" అంటుంటారు. ఇంట ఉన్న గురువును కాదనుకొని ప్రాపంచికంగా ఎంత పరుగులు పెట్టినా, ఎందరు గురువుల్ని ఆశ్రయించినా నిరంతర మౌన ప్రభావం తండ్రిదే! ప్రపంచ దేశాల్ని తిరిగి వచ్చి తండ్రి సమక్షంలో నిలబడితే మౌనం కొత్త సందేశం వినిపిస్తూనే ఉంటుంది. తండ్రి ఒడిలో అక్షరాభ్యాసం చేస్తే ప్రపంచ బడిలో అక్షరాభ్యాసం చేసినట్టే. తన పిల్లలు తనకు మించినవారు కావాలని తండ్రి అనుకుంటుంటే ఏ పనిచేసినా తండ్రి మెప్పు పొందాలని పిల్లలు అనుకుంటుంటారు. ఇదీ జీవన గమనం.

తండ్రి తొలి గురువు! ఓనమాలు దిద్దించిందీ నాన్నే! నడక నేర్పిందీ నాన్నే! ప్రపంచాన్ని జయించు అని ఆశీర్వదించింది నాన్నే! ఎండ పొడ తగలకుండా గొడుగు పట్టిందీ నాన్నే! గొడుగు పట్టడం తండ్రి కర్తవ్యం. అయితే గొడుగు క్రిందకు చేరటం పిల్లల వ్యక్తిత్వం. ఇటువంటి వ్యక్తిత్వం మొదటి అయిదారేళ్లు ఉంటుంది. బడికి ఒంటరిగా వెళ్లటం ప్రారంభం అయ్యేటప్పటికి తనవైన ఆలోచనలు ప్రారంభమవుతాయి. తనదైన వ్యక్తిత్వానికి రూపకల్పన ప్రారంభమవుతుంది. అప్పటినుంచి గొడుగు కిందనే ఉండిపోవాలని పిల్లలు ప్రయత్నించకూడదు. అవసరం మేరకే పిల్లలు తండ్రి నీడన ఉండాలి. ప్రపంచం పెద్దది కాబట్టి ఆ చూరునుంచి జరిగి నడక ప్రారంభించాలి. నడక నలుగురితో అయినప్పుడు నీదైన ముద్ర ఉండాలి. నీ నడక నీది కావాలి. మరొకరిలా అనుకరిస్తే నీకంటూ గుర్తింపు ఉండదు. అనుకరణ లేనిచోటే ఆత్మవిశ్వాసం కలుగుతుంది. అనుకరిస్తున్నంత కాలం ఆత్మన్యూనత వెన్నంటుతుంటుంది. ఏ తండ్రి అయినా తన పిల్లల విషయంలో ఇలా విశిష్ఠ వ్యక్తులు కావాలని భావిస్తాడు. అందుకే పదహారేళ్ల ప్రాయానికి వచ్చిన పిల్లలు తమ నుంచి విడివడటాన్ని తండ్రి మౌనంగా గమనిస్తుంటాడే తప్ప ఏనాడూ అడ్డుపడడు. జాగ్రత్తలు చెబుతూ కుర్రవయసును కన్నెర్ర చేసినా తండ్రి ఆ కన్నెర్రలో కనిపించేది ప్రేమే.

తండ్రీ పిల్లల అన్యోన్యతల మధ్య తల్లి సైతం మౌనవ్రతం పాటించాల్సి వస్తుంది. ఇతరాలేవీ ఆ అనుబంధంలో చొరబడలేవు. ప్రపంచంలోకి నడిపించింది తల్లిదండ్రులే అయినా వృత్తిరీత్యా పిల్లలు ప్రపంచంలోకి ఏమూలనైనా ఉండవచ్చు. పెద్దలు ఉన్నచోటు నుంచి కదలకపోవచ్చు. అయినా వారిమధ్యన ఉన్న దూరాన్ని ఫిజికల్‌గా కొలవగలమేమో కానీ ఎమోషనల్‌గా వారి సాన్నిహిత్యాన్ని తూచటానికి ఏ కొలమానాలు సరిపోవు. పిల్లలు తల్లిదండ్రులకు దూరంగా ఉన్నా, తల్లిదండ్రులు పిల్లల సమీపంలో లేకపోయినా అది ఎమోషనలే తప్ప బంధాలు తెంచుకొని కాదు... అనురాగాలు కాదనుకొని కాదు. ఇందులో ఏది జరిగినా అది తమ చేతులారా చేసుకున్నది అవుతుందే తప్ప మరొకరి ప్రమేయంతో మాత్రం కాదు. ప్రమేయం అంటే చిన్నప్పుడు చదువుకున్న ఓ బుల్లి కథ గుర్తొస్తోంది. చీమా చీమా ఎందుకు కుట్టావ్ అంటే 'నా బంగారు పుట్టలో వేలెడితే కుట్టనా' అందట. ఇలా పెద్దలకైనా, పిల్లలకైనా తమదైన బంగారు ప్రపంచం ఉంటుంది. ఒకరి ప్రపంచంలోకి మరొకరు ప్రవేశించాలి అనుకోవటంతో అహాలు అడ్డొస్తుంటాయి. ఆప్యాయతలు కరవవుతుంటాయి. పిల్లల ప్రైవసీ పిల్లలది. పెద్దల పరిధి పెద్దలది. రెండు తరాల మధ్యా కనిపించని తీరాలు ఉంటాయి. ఒక తరం తమ తీరం దాటి రెండో తీరంలోకి చొచ్చుకుపోతుంటే సుడిగుండాలు తగలవు... సునామీలు ఏర్పడుతుంటాయి. తీరం దాటకుండా అలలు ఎంత ఎత్తుకి ఎగసిపడ్డా నష్టం ఉండదు. ఎగసి మరో తీరంలోకి తుంపర్లుగా పడ్డా తుపాను అలజడే కలుగుతుంది. ●

**(ఈ వ్యాసంలో ఆంగ్ల పదాలు వాడక తప్పలేదు)**

# ఆశీర్వచనములు

శ్రీయుత సంపాదకులు.

శ్రీ గోటేటి శ్రీ రామారావు గారికి నమస్కరించి వ్రాయునది.

మే (మా) ఏప్రిల్ 2011 మాస సంచిక చదివినాను. మీ సంపాద కీయంలో ఖరనామ సంవత్సరము గురించి మంచిగా వ్రాసి నారు. విమాన వెంకటేశ్వరుని ప్రాశస్త్యం గురించి మంచిగా వివరించినారు.

శ్రీరామ జనన చక్రము ఈ రోజు నుండే మా ఇంట్లో దేవుని దగ్గర పెట్టి పూజ చేయుచున్నాను. బాల తిరుపతిగా అప్పనపల్లి వివరించినారు.

శాసనసభకు శ్రాద్ధాలు పెడితే, మీ శవాలను చెట్ల క్రింద పెడతాడు అని ప్రొఫెసర్ కోదండరామ్‌గారి లాంటివారు అనటం బాగా లేదు. వెంపటి చిన్న సత్యం గురించి ప్రభలో ప్రభవించిన కూచిపూడి కళ చాలా బాగుంది. డా॥సముద్రాల లక్ష్మణయ్య, వంగూరి చిట్టెన్ రాజు గురించి బాగా వ్రాసినారు. ఇంకా మంచి మంచి విషయాలు పాఠకులకు తెలియచేయమని కోరుచు — మీ శ్రేయోభిలాషి

**ఓ.డి.రామారావు**

సంపాదకులకు
నమస్కారములు.
ప్రముఖాంధ్ర జూన్
సంచికలో నటసామ్రాట్
అక్కినేనిగారిని గురించిన వ్యాసము
చదివాము. చాలా సంతోషము. లోక
కళ్యాణార్థమై అవతారమెత్తిన సుగుణాభిరామునిగా
తెరపై జన్మించి, ఆ జానకీవల్లభుని గానామృతాన్ని
నేటికీ సకల జనావళి మరచిపోలేని విధంగా మధుర
కావ్యంగా మలచి వాల్మీకీగా నటించి అఖిలాంధ్ర
తెలుగు జనుల హృదయాలలో చెరగని ముద్రవేసిన నా
అభిమాన నటుడు పద్మశ్రీ అక్కినేని నాగేశ్వరరావుగారు
ధన్యజీవి. అంతటి మహనీయుని గురించిన వ్యాసం
అందించిన మీకు కృతజ్ఞతలు. 90వ పడిలో నున్న
వారు నిండు నూరేళ్ళు జీవించాలని, ఇలా
మహనీయుల గురించి వ్రాసే మీ సత్సంకల్పం
కొనసాగాలని ఆశిస్తున్నాము.
భవదీయుడు
**గుడిమెట్ల చెన్నయ్య**

## ప్రముఖాంధ్రకు దీవెన

ప్రాచీన కవులను, వారు రచించిన గ్రంథాలను వెలికి తీసి, ఇప్పటి తరానికి అందిస్తూ, సంగీత, సాహిత్య, భరతనాట్యాది, నాటక కళలను అతిముఖ్యమైన వార్తలను ప్రచురిస్తూ హిందువుల సంప్రదాయ, ఆచార, వ్యవహారాలనేగాక, రామాయణ, మహాభారత, భాగవత, పురాణాలలోని అనేక అంశాలను అవసరాన్ని బట్టి ఉటంకిస్తూ, తెలుగువారి కీర్తి ప్రతిష్ఠలను ప్రముఖాంధ్ర ద్వారా ప్రపంచ వ్యాపం చేస్తూన్న, పత్రిక 18 సంవత్సరాల నుండి నిరంతరాయంగా చెన్నై నుండి వెలువడుతున్న ప్రముఖాంధ్ర వార, పక్ష, మాస పత్రికలలో అగ్రతాంబూలం అందుకున్నదని, అనేక సంవత్సరాలుగా ఆ మాసపత్రికను ఆద్యంతము చదువుతున్న నేను అనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

జి.వి.రావు పేజీని ఒక ఆణిముత్యంలాగా ప్రకాశింపచేస్తున్న శ్రీ జి.వి.రావుగారు అభినందనీయులు. నాకు అత్యంత సన్నిహితులు, నిరాడంబరులు, మితభాషి, హితభాష, "విద్యావిశారద" శ్రీ గోటేటి శ్రీ రామారావుగారు వృద్ధాప్యాన్ని కూడా లెఖ్ఖ చేయకుండా అవిశ్రాంతంగా అహర్నిశలు ప్రముఖాంధ్రకు చేస్తున్న కృషి, పట్టుదల, అనితరసాధ్యము. బహుధా ప్రశంసనీయము.

శ్రీ రామారావు గారికి వినయపూరిత మనస్సుమాంజలులు అందచేస్తున్నాము.

నన్ను ఎల్లప్పుడూ కాపాడుతున్న, నెల్లూరుకి సుమారుగా 12 కి.మీ దూరంలో ఉన్న ఆ జొన్నవాడ కామాక్షమ్మ అమ్మవారు శ్రీ రామారావుగారికి, వారి కుటుంబంలోని అందరికీ సంపూర్ణ, ఆరోగ్య, ఐశ్వర్య, భోగ, భాగ్యములను సదా ఇచ్చి, కాపాడవలసిందిగా మనస్ఫూర్తిగా ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**– మల్లంపల్లి రామప్రసాదు**

సాహితి సార్వభౌములు,
శ్రీ గోటేటి రామారావు గారికి శుభాభివందనములు!

మీరు వ్రాసిన ఉత్తరము అందినది. సంగతులను గ్రహించాను. మీ ఆరోగ్యము బాగుపడిన సంగతి తెలుసుకొని ఎంతో సంతోషపడ్డాను. తెలుగు తల్లి మిమ్ము కాపాడును గాక అని ప్రార్థిస్తున్నాను.

మలేషియాలో జరిగిన సభలను గూర్చిన వివరాలు గల "తెలుగుతల్లి–96"ను మీకు దీపావళికి ముందుగానే పంపించాను. దానితో అది ముఖ్యమైన "తెలుగుతో వెలువడిన తపాల్లా బిళ్ళను" ప్రత్యేకంగా మీకు పంపించాను. మలేసియా చరిత్రలో ఆంగ్లము, మలాయి భాషలు తప్ప వారే భాషలో ఈ తపాలా, బిళ్ళలు వెలువరింపలేదు. తొలిసారిగా మలేసియా ప్రభుత్వము "తెలుగు ధనం" అన్న తెలుగు లక్షరాలు గల తపాలా బిళ్ళలు వెలువరించినది. ఇది మన ప్రపంచ తెలుగు జాతికి గర్వకారణం కదా!

మీకు మలేసియా తెలుగు సంఘ అధ్యక్షులు డా.అచ్చయ్య కుమార్ రావుగారి చిరునామా, దూరవాణి వివరాలు యివిగో:

Dr. Achaiah Kumara Rao
15, Jalan Bersatu 10, Taman Bersatu,
48000 Rawang, Malaysia.
Phone : 03-60921220. Cell : 012-3045594

ప్రపంచ దేశాల్లోని ప్రతీ రాష్ట్ర తెలుగువాడు ఈ రకమైన కృషి చేసి తెలుగు ద(ధ)నాన్ని పెంచుకోవచ్చు. సత్యమైన కృషికి మించిన శక్తి లేదు.

**– మదిని సోమనాయుడు**

# "సత్యం" పరమాత్మ/ధర్మ స్వరూపం

- కె.మల్లికార్జున, బళ్లారి

ఒక వ్యక్తి లోకానికి ఆదర్శంగా ఉండాలంటే అతను తప్పకుండా కొన్ని నియమాలను పాటించి తీరాలి. అటువంటి నియమాలలో సత్యం ప్రధానమైనది. సత్యాన్నిపలకమని, అసత్యాన్ని పలకవద్దని మన వేదాలు, పురాణాలు శాసించాయి.

సత్యాన్ని పరమాత్మ స్వరూపంగా మన పురాణాలు గుర్తించాయి. సత్యాన్ని పలకడం వల్ల ఆ పరమాత్ముని సేవించినంత ఫలం మనకు దక్కుతుంది. మనము ఇతరులకు ఆనందాన్ని కలిగే విధంగా మాట్లాడాలని మన పెద్దలు చెబుతారు. కానీ ఎటువంటి పరిస్థితులలోనూ అసత్యం పలకకూడదు. ఆనందాన్ని కలిగించని సత్యాన్ని చెప్పకూడదు. అలాగని ప్రియంగా ఉండే అసత్యాన్ని పలకరాదు. ఇదీ సనాతన ధర్మమని మన తరాల పరంపర చెబుతుంది.

ఈ లోకంలో సత్యాన్ని మించిన ధర్మం లేదు. సత్యమే జ్ఞానం. సత్యం 'ఋతం'తో సమానమైందని ఆగమాలు చెబుతున్నాయి. 'సత్యం' అంటే నిజం పలకటం. ఋతం అన్నా అదే అర్థం. ఋతం కానిది అనృతం. అంటే 'అబద్ధం' అని అర్థం. మామూలుగా అయితే ఈ రెండు పదాలకు అర్థంలో పెద్దగా తేడా లేకపోయినా, లోతుగా ఆలోచిస్తే మాత్రం కొంత వ్యత్యాసం కనిపిస్తుంది. సత్యం అనేది సర్వకాల సర్వావస్థల్లోనూ మారకుండా ఒకటిగానే ఉంటుంది. ఋతం మాత్రం దేశకాల పరిస్థితులను బట్టి మారుతూ ఉంటుంది.

ఈ తేడాను వివరంగా చెప్పాలంటే ఒక కథను పరిశీలిద్దాం. అనగనగా ఒక దట్టమైన అడవి ఉంది. ఆ అడవిలో ఒక ముని ఆశ్రమాన్ని నిర్మించుకుని తపస్సు చేసుకుంటూ ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతూ ఉంటాడు. ఒక రోజు ఓ జింక ప్రాణ భయంతో పరిగెత్తుకుంటూ వచ్చి ఆ ముని ఆశ్రమంలో దాక్కుంది. కొంతసేపటికి ఆ జింకను తరుముతూ వచ్చిన వేటగాడు ఆ ఆశ్రమాన్ని కొచ్చి "స్వామీ! ఇటువైపు ఏదైనా జింక వచ్చిందా?" అని ఆ మునిని అడిగాడు. ముని దాని విషయం తనకు తెలియదని చెప్పాడు. ఇలా చెప్పటాన్ని ఋతం అంటారు. ఇక్కడ ఆ ముని నిజం చెపితే ఆ జింకకు ప్రాణ హాని కలుగుతుంది. అసత్యం పలికితే ఆ జింకకు ప్రాణం పోతుంది. జింకను రక్షించుటకై అసత్యం పలికినా ఫరవాలేదు. ఎందుకంటే పరిస్థితులను బట్టి సత్యాన్ని అసత్యంగా పలుకుట న్యాయ సమ్మతమే అవుతుంది. సత్యం చాలా కచ్చితంగానూ, సూటిగానూ ఉంటుంది.

అసత్యాన్ని కొన్ని కొన్ని సందర్భాల్లో చెప్పినా దోషం లేదని వివరించిన హారీతుడు, వసిష్ఠుడు మొదలగు మహర్షులూ సత్యానికే అగ్రస్థానం ఇచ్చారు. వెయ్యి అశ్వమేథ యాగాలు చేస్తే, ఎటువంటి ఫలం దక్కుతుందో, అంతకంటే ఎక్కువ ఫలాన్ని సత్యనిష్ఠ ఇస్తుంది.

సత్యాన్ని తు.చ. తప్పకుండా పలకాలి. అసత్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పకూడదు అనే నియమాన్ని పాటిస్తూ జీవితాన్ని గడపటం అంత సులభం కాదు. అలా ఎన్నుకున్న బాట ముళ్ల బాటగా ఉంటుంది. అడుగడుగునా కష్టాలే ఎదురవుతాయి. నరకంలా అనిపిస్తుంది. విషాద స్వరాలు వినిపిస్తాయి. అయినా ఏ మాత్రం అధైర్యపడకుండా చెక్కుచెదరని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే చివరికి తప్పకుండా విజయం వరిస్తుంది. ఇదే సత్యం మార్గంలో వెళ్లటానికి అందరూ సాహసించరు.

కానీ, సూర్యవంశపు రాజైన హరిశ్చంద్రుడు సత్యం కోసం తన సంపదనీ, రాజ్యాన్నీ; భార్యబిడ్డల్నీ వదులుకున్నాడు. చివరికి తనని తానే అమ్ముకున్నాడు. కాటికాపరి అయ్యాడు. ఎన్ని కష్టాలెదురైనా ఆయన తన సత్యనిష్ఠ వదులుకోలేదు. ఆ విధంగా హరిశ్చంద్రుడు సంపాదించిన శాశ్వతమైన కీర్తి చంద్రికల్ని ఎవరైనా పొందగలరా?

మౌర్యవంశ చక్రవర్తి అయిన ఆశోక వర్ధనుడు తన రాజ్యంలోని ప్రధాన నగరాల్లో శిలాస్తంభాల్ని నెలకొల్పి వాటి మీద సత్యం గొప్పదనాన్ని అక్షరబద్ధం చేశాడు. ఆయన మనసులో పరిమళించిన ఆ సత్యనిష్ఠను ఏమని వర్ణించగలము? నాలుగు యుగాల్లో మొదటిదైనా 'కృతయుగము' ను 'సత్యయుగం' అని అంటారు. ఆ కాలంలో సత్యానికి పెద్ద పీట వేశారు. కాబట్టి ఆ యుగాన్ని సత్యయుగంగా పిలిచారు.

స్నానం చెయ్యడం వల్ల బాహ్యశుద్ధి జరిగితే సత్యం పలకటం వల్ల అంత శుద్ధి అవుతుంది. తమిళవేదం తిరుక్కురళ్ చెప్పినట్లు- ఇతరులకు కొంచెం కూడా కీడు కలిగించని మాటలు మాట్లాడటమే సత్యమని తెలుసుకుంటే లోకమంతా ఆనందం వెల్లివిరుస్తుంది. ●

## వేధింపులూ, అరెస్టులతో ఆంధ్రప్రదేశ్ నాయకులను, అధికార్లనూ, అమాత్యులను వేధిస్తున్న చరిత్ర గతంలో లేదు!

ఎల్వీ సుబ్రహ్మణ్యం మంచి అధికారి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆయన తప్పు చేయలేదని అన్నప్పటికినీ విచారణలతో మానసిక క్షోభ కల్గించడమేఁవిటని పలువురు భక్తులూ, ఐఏఎస్ అధికారులే అడిగారు. సౌభాత్రతకూ, చిత్తశుద్ధికీ పేరున్న అధికారి. తిరు మల తిరుపతి దేవస్థానములకో చక్కని కార్యనిర్వహణాధికారి వచ్చాడన్న తరుణంలో వేదించడం సబబా అని పాఠకులు అడుగు తున్నారు.



ఎల్వీ సుబ్రహ్మణ్యం

ఆంధ్రప్రదేశ్ దురదృష్టమేమోగాని వై.ఎస్. రాజశేఖరరెడ్డి మరణానన్తరం కల్లోల సాగర మైంది. చరిత్రలో ఎన్నడూ జరుగ నంతగా తెలంగాణా ఉద్యమాలు, ప్రతి ఉద్యమాలు కల్లోలితం చేసాయ్. వార్తలకుగాకుండా వ్యాఖ్యలకూ, నీలి వార్తలకూ ప్రాధాన్యమిచ్చిన మీడియా, దాన్ననుసరించి కేసులు, కేసులతోనే అరెస్టులూ చిత్ర విచిత్రంగా జరిగాయ్. అమాయకులైన అధికార్లు జైళ్ళ పాలయ్యారు. కాబినేట్‌కు అనుసారంగా వ్యవ హరించే ఐ.ఏ.ఎస్. అధికారులను అరెస్టు చేయడం, మానసికంగా వారిని చిత్రవధ చేయడమే! మనసా, వాచా, కర్మేణా ఆర్యధర్మపరుడు ఎల్వీ సుబ్రహ్మణ్యం. ఎవరూ కాదనలేని సత్యం. ●



శ్రీ ఎల్.వి.సుబ్రమణ్యం IAS, E.O. గారిని సన్మానిస్తున్న కంచి రఘురామ్ మరియు భీమాస్ రఘు



# జీ.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

మనకోసమే భగవంతుడు దేదీప్యమానమైన గురువు రూపాన్ని ధరిస్తాడు.
గురుతత్త్వం అర్థమయ్యేకొద్దీ క్రమంగా నామరూపాలు నశించి, దైవం నిజరూపంలో సాక్షాత్కరిస్తాడు.

– స్వామి వివేకానంద



ఈ గురుపూర్ణిమ (జూలై 3) సందర్భంగా ప్రణవ స్వరూపుడు, జ్ఞాన స్వరూపుడు, నిర్మలుడు, నిశ్చలుడు, ప్రశాంత స్వరూపుడైన దక్షిణామూర్తికి ప్రణామములర్పిస్తూ గురుస్మరణ చేసుకుందాం. గురుపూర్ణిమ అంటే అజ్ఞానమును దూరం చేసుకుని ప్రజ్ఞానమనే ప్రకాశవంతమైన జ్యోతిని హృదయమునందు వెలిగించుకొనడమే గురుపూర్ణిమ. మన శాస్త్రాలలో గురువుకి అత్యున్నత స్థానం వుంది.

**గురుర్బ్రహ్మ, గురుర్విష్ణు, గురుర్దేవో మహేశ్వరః**
**గురుసాక్షాత్ పరబ్రహ్మ తస్మైత్ శ్రీ గురవే నమః**

త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు గురువు రూపంలోనే వున్నారని, గురువు సాక్షాత్ భగవంతుని స్వరూపమని మన పెద్దలు చెప్పారు. అందుకే తులసిదాసుగారు గురువు, దేవుడు ఒకేసారి ప్రత్యక్షమయ్యే అవకాశం నీకు కల్పిస్తే ఎవరు కావాలని అడిగితే గురువే కావాలని సమాధానం చెపుతూ, ఆ గురువు దైవాన్ని చేరే మార్గాన్ని చూపెడతాడు. కాబట్టి గురువునే కోరుకుంటాను అన్నారు. గురువునే దైవంగాను, దైవాన్ని గురువుగాను చెపుతూ చిన్నప్పుడు మనకు కృష్ణశతకంలోని పద్యాన్ని చెపుతూ వుండేవారు.

**నీవే తల్లివిదండ్రివి**
**నీవే నాతోడునీడ నీవే సఖుడా**
**నీవే గురుడవు, దైవము**
**నీవే నా పతియు గతియు నిజముగ కృష్ణా**

గురువును ఎలా దైవంగా భావిస్తున్నామో అలాగే దేవుడిని తల్లి, తండ్రి, స్నేహితుడు సర్వం ఆయనే అనే తలంపు మనలో వుండాలి. చంద్రుడు పూర్ణముగా ప్రకాశించిన రోజు పూర్ణిమ గురు అనుగ్రహంతో పూర్ణత్వము పొందే రోజు గురుపూర్ణిమ. గురుపూర్ణిమ అనుగ్రహం ఎల్లప్పుడు ఉండాలని కోరుకుంటూ గురువులకు నమస్కరించుకుందాం. ఆ జగద్గురువులను సేవించి సద్గతులను పొందుదాం.

* * *

జూలై నెలలో వివేకానందుని స్మరించుకోవడం ఉత్తమం. రామకృష్ణ పరమహంస ప్రియ శిష్యుడు, భరతమాత ముద్దుబిడ్డడు, మహాభక్తుడు, కర్మయోగి, అద్వైత వేదాంతి, తన ప్రవచనాల ద్వారా భారతదేశంలోని వారినే కాక విదేశీయులను కూడా ప్రభావితం చేసిన మహాప్రవక్త. మహాదేశభక్తుడు, మానవ జాతి ప్రేమికుడైన వివేకానందునికి నమస్కరిస్తున్నాను.

* * *

ప్రపంచంలో ముగ్ధమనోహరమైన ప్రకృతి సంపద, శాంతియుత సహజీవనం, మహోన్నతమైన ఆధ్యాత్మిక సంపదా ఇవన్నీ ఉన్న ఏకైక దేశం భారతదేశమే. అన్ని మతస్థులనూ ఆదరిస్తూ, గౌరవిస్తూ సుహృద్భావంతో సహజీవనం కొనసాగించే అపురూప సంస్కృతి ఉన్నది భారతదేశంలోనే. ఇది వేదభూమి. జ్ఞానభూమి, త్యాగభూమి, కర్మభూమి, యోగభూమి. ఈ భారత పుణ్యభూమిలో జన్మించడమే మహాభాగ్యంగా ఎందరో విదేశీయులైన చరిత్రకారులు, వేదాంతులు ప్రశంసించారు. భారతదేశాన్ని తన మాతృదేశంకన్నా ఎక్కువగా ప్రేమించి భారతీయ వైభవాన్ని లోకానికి చాటినది ఆంగ్లవనిత అనీబీసెంట్. వివేకానందుల బోధనల వల్ల ప్రభావితమైనది విదేశీ వనిత మార్గరేట్ ఎలిజబేత్. లండన్ దేశాన్ని వదిలి సిస్టర్ నివేదితగా ప్రఖ్యాతిగాంచి భారతదేశానికి ముగ్ధురాలై ఇక్కడే ఉండి దీనజనుల సేవలో తరించింది. భారతదేశము గాలిలో సత్యమున్నది. ధూళిలో కరుణ ఉన్నది. గంగా, యమున, గోదావరి మొదలగు పుణ్యనదులున్న పరమ పవిత్రమైన భూమి. ఇంతటి పవిత్రమైన, దివ్యమైన భూమి ప్రపంచంలో ఇంకెక్కడా లేదు. ఎందరో అవతారమూర్తులు, మహర్షులు, యోగులు, అవతరించిన భూమి. దేశ, విదేశీయు లందరూ మెచ్చిన భూమి. ఈ పుణ్యభూమిని ఆక్రమించుకోవాలని చూసినప్పుడల్లా ఎందరో తమ ప్రాణాలను పణంగా పెట్టి కాపాడబడుతున్న భూమి. ఇదంతా ఎందుకు వ్రాయవలసి వచ్చిందంటే ప్రపంచంలో ఒలింపిక్స్ గేమ్‌లకు టెన్నిస్ టీమ్ సెలెక్ట్ చెయ్యడానికి మన ప్రభుత్వం పడరాని పాట్లు పడింది. ఈయన ఆయనతో ఆడనని, ఆయన ఈయనతో ఆడనని బెదిరించారు. ఇద్దరిని బుజ్జగించడం ఇద్దరికి తలొగ్గడం నాలాటివారికి బాధనిపించింది. అసలు టీమ్ పంపించకపోయినా, పరవాలేదు కాని ఒక దేశాన్ని శాసించేవాళ్ళని దేశం బహిష్కరించినా తప్పులేదు. దేశం గొప్పా, అందులోని క్రీడాకారులు గొప్పా అని అడిగితే దేశమే గొప్ప అని చెప్పాలి. అసలు ఆ ఆటగాళ్లందర్ని టెన్నిస్ ఆట నుంచి నిషేధించినా పరవాలేదు. ఈ సంగతిలా వుంచితే మహారాష్ట్రలోని బొంబాయి నగరంలో సెక్రెటేరియట్ (పరిపాలన భవనం, మంత్రాలయం)లో రెండతస్థులు తగలబడి పోయాయి. ఇది కుట్రా లేక నిజంగానే జరిగిందా అనే విషయాలకు పోకుండా వేరొక విషయం గురించి చర్చిద్దాం. ఆ అగ్నిప్రమాదం జరిగినప్పుడు అక్కడున్న పి.డబ్ల్యూ.డి. వర్కర్లు ఆరు మంది పై అంతస్తులో రెపరెపలాడుతున్న మువ్వన్నెల జాతీయ జెండాను కాలిపోకుండా ఆ మంటలలోనించి పైకి వెళ్ళి దాన్ని జాగ్రత్తగా ఆ స్థంభం నుంచి కిందకు దించి జాగ్రత్తపరిచారు. అదీ దేశభక్తి అంటే. అగ్నిమాపక దళం వారు వారిస్తున్నా వినకుండా వారీ పని చేసారు. వారి ప్రాణాలు ఫణంగా పెట్టి దేశ గౌరవాన్ని నిలిపారు. ఈ పని చెయ్యడానికి వారికి పై అధికారుల నుండి ఆర్డర్లు రావడానికి కొంత సమయం పట్టింది. ఆర్డర్ అందుకున్న తక్షణం వారు భరతమాత సైనికుల్లా అగ్నిజ్వాలల్ని దాటుకుంటూ వెళ్ళి ఆ త్రివర్ణ పతాకాన్ని బూడిద కాకుండా కాపాడారు. దాన్ని గుడ్డపీలికగా అనుకోకుండా జాతిచిహ్నంగా తలిచారు కాబట్టి వారీ పని చెయ్యగలిగారు. డబ్బుల కోసం, గౌరవం కోసం అహంకారంతో దేశాన్ని గౌరవించకుండా ఉన్న ఆటగాళ్ళను కనీసం వారం రోజులు బ్రతిమాలారు. దేశభక్తపరులైన ఈ ఆరుగురిని కనీసం మాటలతోనైనా అభినందించలేదు మన నాయకులు. అన్నిటికి ఎగబడే మీడియా వారు దీనికి అంత ప్రాధాన్యం ఇవ్వలేదు. కాని ఆ ఆరుగురు ఇవన్నీ ఆశించి ఈ పని చెయ్యలేదు. సాధారణ పి.డబ్ల్యూ.డి. వర్కర్లకు అంతపాటి తెలివితేటలుండవు. కాని దేశం పట్ల వారికున్న అభిమానానికి మాలాంటి దేశాన్ని ప్రేమించేవారికి వారే హీరోలు. భరతమాత ముద్దుబిడ్డలు.

*